# పెన్ పవర్

ప్రజాగళానికి అక్షర రూపం   తెలుగు దిన పత్రిక

## తూర్పుగోదావరి

సోమవారం | 9, ఏప్రిల్ 2018 | పేజీలు 8


## సంతృప్తితో సాగిన కాలం



- సంస్కరణలు కొనసాగితే సంతోషమే - అర్హతలు, నైపుణ్యాలే అందలమెక్కిస్తాయి
- అన్ని వర్గాల సహకారమూ అందింది
- పదవి బాధ్యతలు పూర్తి చేసుకున్న జెఎన్‌టియుకె విసి విఎస్ఎస్.కుమార్

**కాకినాడ రూరల్, పెన్‌పవర్ :** భగవంతుని అనుగ్రహం, తల్లిదండ్రుల ఆశీస్సులుతోడై తనను ఉన్నత స్థితికి చేర్చడం, చదివిన చదువుకి సార్ధకత లభించడం తన అదృష్టమైతే... పొందిన పదవిని సంతృప్తితో కొనసాగించడం తన పూర్వజన్మ సుకృతమని జవహార్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ (జెఎన్‌టియుకె) ఉపకులపతి విఎస్ఎస్.కుమార్ తన భావాలను వెల్లడించారు. మూడు సంవత్సరాల విసి పదవీకాలం పూర్తికావడంతో తిరిగి తన ప్రొఫెసర్ పదవిలో చేరేందుకు భాగ్యనగరంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సోమవారం పయనం కానున్నారు. ఈ సందర్భంగా 'పెన్‌పవర్'తో ముచ్చటిస్తూ తన హయాంలో ప్రత్యేకతలు నింపుకున్న డిజిటల్ లైబ్రరీ, ఆన్‌లైన్ పరీక్షా విధానం, జంబ్లింగ్ పద్ధతి, విద్యార్థి కేంద్రీకృత విద్యాబోధనా, శాస్త్రీయ దృక్పధంపై అవగాహనా, శిక్షణలు వంటి సంస్కరణలు భవిష్యత్తులో వచ్చే విసీల హయాంలో కూడా కొనసాగితే అంతకంటే ఆనందం మరొకటుండదని అభిప్రాయపడ్డారు. ఉన్నత చదువుతోపాటు సంస్కారమూ, తోటిమనిషిపట్ల అభిమానమూ, వ్యక్తిత్వమూ ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో శ్రద్ధ చూపాల్సిన అధ్యాపకులు... వారిని లైంగికంగా వేదిస్తే సహించబోమనడానికి కీచక డైరెక్టర్‌ను చట్టానికే అప్పగించడమే నిదర్శమన్నారు. ప్రభుత్వ జీవోకి వ్యతిరేకంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినికి జీతం పెంచిన మరో డైరెక్టర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించడంలో తాను పక్షపాత రహితంగా వ్యవహరించేందుకు నిదర్శనమైందన్నారు. సాంకేతిక విశ్వవిద్యాలయం భవిష్యత్తు అధ్యాపకుల నైపుణ్యాలు, అనుభవం పైనే అధికంగా ఆధారపడి ఉన్నాయన్నారు. ఏ దేశ అభివృద్ధి అయినా మానవ వనరుల అభివృద్ధిపైనే అధికంగా ఆధారపడి ఉంటుందన్నారు. అయితే మానవ వనరులు కూడా నైపుణ్యత పెంచుకోగలిగి ఉన్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జెఎన్‌టియుకెలో రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలలో మార్గదర్శకాలననుసరించి కొంతశాతం ప్రాధాన్యతను తాత్కాలికంగా పనిచేసే అధ్యాపకులకు ఇవ్వాలని తానుకూడా కోరుకుంటున్నట్టు చెప్పారు.

రెగ్యులర్ అధ్యాపకుల నియామకంలో అర్హత సాధించేందుకు తాత్కాలిక లెక్చరర్లు ప్రయత్నించాలన్నారు. అడపా, దడపా మినహా అన్ని వర్గాల సహకారం తనకు పూర్తిగా అందిందన్నారు. భవిష్యత్‌లో పదవిని పొందే విసిల హయాంలో జెఎన్‌టియుకె మరింతగా అభివృద్ధి చెందగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మొత్తం మీద ప్రశాంతంగా తన పదవీకాలం ముగిసి, సంతృప్తితో మాతృ సంస్థకు చేరుతున్నానని విసి విఎస్ఎస్.కుమార్ పేర్కొన్నారు.


# ప్రజాశక్తి

## తూర్పుగోదావరి

సోమవారం
ఏప్రిల్ -9
2018
పేజీలు 12


## జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసిగా రామకృష్ణ?

**కాకినాడ :** జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసిగా కృష్ణా యూనివర్సిటీ విసి రామకృష్ణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. ఇప్పటి వరకూ విసిగా ఉన్న విఎస్ఎస్.కుమార్ ఉద్యోగ విరమణ పొందనుండటంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం.